క్లుప్తంగా

వేంకటేశ్వరునికి వైభవంగా అభిషేకాలు


గుండుగొలనులో స్వామి వారికి తులసిదళార్చనతో పూజలు చేస్తున్న అర్చకులు

భీమడోలు: దేవదాయ, ధర్మశాఖ పరిధిలోని గుండుగొలనులోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం సంప్రోక్షణాభిషేక పూజలు వైభవంగా నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ నిర్వాహకులు వగ్వాల మీనాకుమారి ఆధ్వర్యంలో లక్ష తులసి దళార్చనతో విశేష పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేసారు. వైఎస్సార్ సీపీ నాయకులు వగ్వాల అచ్యుతరామారావు, ఈవో డి.శంకరరావు, భక్తులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

ఉంగుటూరు: తాడేపల్లిగూడెం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. నీలాద్రిపురం ఇందిరమ్మ కాలనీలో పచ్చా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. దుప్పట్లను 30 మందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ చిన్నం జగదీష్, కోశాధికారి జీడిగుంట హరిబాబు, పచ్చా వెంకటేశ్వరరావు, ఆనందవు, ఇందిరమ్మ కాలనీవాసులు పాల్గొన్నారు.

కూలీపై ఆటో డ్రైవర్ దాడి

భీమడోలు: పూళ్లలో బుధవారం రాత్రి పాత కక్షల నేపథ్యంలో ఓ వ్యక్తిపై ఆటో డ్రైవర్ దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. ఈ ఘటనలో వ్యవసాయ కూలీ నూతులపాటి పోలు గాయాలతో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వివరాల్లోకి వెళ్లితే పూళ్ల గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ సిద్ధాబత్తుల విఘ్నేష్, కూలీ నూతులపాటి పోలు కుటుంబ సభ్యుల మధ్య పాత కక్షలున్నాయి. ఈ నేపథ్యంలో వారిద్దరూ మద్యం సేవించి గొడవపడ్డారు. మద్యం మత్తులో ఆటో డ్రైవర్ సిద్ధాబత్తుల విఘ్నేష్, అతని తమ్ముడు కలిసి బీరు సీసాలను పగలకొట్టి అక్కడే ఉన్న కూలీ పోలు తలపై కొట్టి తీవ్రంగా గాయపర్చారు. క్షతగాత్రుడిని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భీమడోలు ఎస్సై వై.సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

పెదపాడు: గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్టు జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ తెలిపారు. వసంతవాడ గ్రామస్తులు కొంతమంది గ్రామంలోని సమస్యలను జెడ్పీ చైర్‌పర్సన్ దృష్టికి తీసుకురావడంతో ఆమె మండల స్థాయి ఇంజనీరింగ్ అధికారులతో కలిసి వసంతవాడ వచ్చి పరిశీలించారు. గ్రామస్తులు డ్రెయిను రోడ్లు, గంగానమ్మ గుడి వద్ద రాములగుడి నిర్మాణం చేపట్టాలని కోరారు. అభివృద్ధి పనులకు అంచనాలు తయారు చేసి అందించాలని ఇంజనీరింగ్ అధికారులను జెడ్పీ చైర్‌పర్సన్ ఆదేశించారు. ఎస్సీ ఏరియాలో డ్రెయినేజీలు నిర్మించాలని, హౌసింగ్ అధికారులతో మాట్లాడి ఇళ్లు నిర్మించుకున్న వారికి త్వరితగతిన బిల్లులు మంజూరు చేయాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో బీసీ సెల్ అధ్యక్షుడు, నర్సాపురం నియోజకవర్గ పరిశీలకుడు ఘంటా ప్రసాదరావు, స్థానిక సర్పంచ్ చింతల రమాభారతి, సంబంగి శ్రావణ్‌కుమార్, చింతల ఆనంద్, ఇంజనీరింగ్ అధికారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత, నృత్య ప్రదర్శనలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావు పేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న స్వామి వారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన వివిధ సంగీత, కూచిపూడి నృత్య ప్రదర్శనలు భక్తులను విశేషంగా అలరించాయి. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన నిర్వహించి అనంతరం శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ చేశారు. స్వామి వారి నిత్య కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. తెనాలికి చెందిన నోరి నారాయణ మూర్తి హనుమద్ వైభవంపై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. పోలిశెట్టి పృధ్వీసాయి తులసి, ఉషాలావణ్య నిర్వహించిన అన్నమాచార్య గానామృత సంగీత కార్యక్రమం అలరించింది. శ్రీపాద శ్రీవల్లభ కూచిపూడి నాట్య నిలయం ఆధ్వర్యంలో ప్రిన్స్‌పాల్ మేడరమెట్ల శిరీష శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ట్రస్ట్‌బోర్డు చైర్మన్ తోలేటి శ్రీనివాస్, కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసిరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఏలూరు (టూటౌన్): ఏపీ చేతివృత్తిదారుల సమాఖ్య 2024 వార్షిక క్యాలెండర్‌ను ఏలూరు జిల్లా నాయకులు, సీపీఐ నాయకులు గురువారం ఆవిష్కరించారు. స్థానిక ఆర్ఆర్‌పేటలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో చేతివృత్తిదారుల సమాఖ్య నాయకులు కడుపు కన్నయ్య, పాట్టేలు పెంటయ్య, పడాల సూరిబాబు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్, రాష్ట్ర కంట్రోల్ మిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు యర్ర వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. చేతి వృత్తులపై ఆధారపడిన వృత్తిదారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థికంగా సహకారం అందించి వృత్తులను ప్రోత్సహించాలని కోరారు.

క్రీడలతో ఆనందం..ఆరోగ్యం


పెదపాడు: పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ


భీమడోలు: క్రికెట్ ఆడేందుకు సిద్ధమైన క్రీడాకారులు


దెందులూరు: నియోజకవర్గ పోటీలకు ఎంపికైన వాలీబాల్ జట్టు

పెదపాడు: ఆటలు ఆడటం ద్వారా ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు ఆనందం కలుగుతుందని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. పెదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆడుదాం ఆంధ్రలో భాగంగా మండల స్థాయి క్రికెట్, షటిల్ ఆటల పోటీలను గురువారం జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ ప్రారంభించారు. క్రికెట్ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందించడంతో పాటు, ప్రజలు తమ దైనందిన జీవితంలో తనమునకలై ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేస్తున్నారని అందుకోసం ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు మాట్లాడుతూ ఏటా ఈ పోటీలను నిర్వహించడం ద్వారా యువతలో పోటీతత్వం పెరిగి ఆటలపై దృష్టి సారిస్తారని అన్నారు. ఈ పోటీల్లో విజేతలకు నగదు బహుమతులతోపాటు ప్రసంశాపత్రాలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో/ఎస్ నర్సింహమూర్తి, తహసీల్దార్ జీ విజయకుమార్ రాజు, పీఈటీ షణ్ముఖం, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

భీమడోలు: యువతలో క్రీడా నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రభుత్వం చేపట్టిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో మండలస్థాయి క్రికెట్ పోటీలు రెండో రోజైన గురువారం ఉల్లాసభరిత వాతావరణంలో నిర్వహించారు. మండల పరిధిలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన క్రీడాకారులు ఉత్సాహంగా ఆడి తమ ప్రతిభను చాటారు. 6 మ్యాచ్‌లు నిర్వహించగా మూడు టీములను ఎంపిక చేశారు. ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి ఏర్పాట్లను పర్యవేక్షించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని వారిలో క్రీడా స్ఫూర్తిని నింపారు. శుక్ర, శనివారాల్లో పోటీలు కొనసాగుతాయని ఎంపీడీవో పేర్కొన్నారు. తొలుత గుండుగొలను, కోరుకల్లు జట్లు తలపడ్డాయి. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ సుందరి, మండల స్థాయి అధికారులు, గ్రామకార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల్లో గోపన్నపాలెం జట్టు ప్రతిభ

దెందులూరు: ఆడుదాం ఆంధ్రలో భాగంగా దెందులూరు మండలం వాలీబాల్ ఫైనల్స్‌లో పోతునూరు- గోపన్నపాలెం మధ్య పోటీలు జరిగాయి. గోపన్నపాలెం జట్టు 25-14, 25-21 స్కోర్లతో విజయం సాధించి నియోజకవర్గ పోటీలకు అర్హత సాధించింది. నియోజకవర్గ పోటీలకు ఎంపికైన గోపన్నపాలెం వాలీబాల్ జట్టును ఎంపీడీఓ ఎం. భీమరాజు, మండల కోఆర్డినేటర్ సురేష్, సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్, ఎంపీటీసీలు ఏనుగు అంజలి ప్రసాద్, సువ్వా ప్రభుదాసు, హెచ్ఎం డాక్టర్ ఎం. మనోహర్, గ్రామ కార్యదర్శి స్టానీష్‌బాబు అభినందించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు, నియోజకవర్గానికి ఎంపికైన వాలీబాల్ జట్టును అభినందించారు.

అంగన్‌వాడీ సిబ్బందికి నోటీసులు అందజేత

దెందులూరు: అన్ని గ్రామాల్లో ఉన్న అంగన్‌వాడీ సిబ్బందికి నోటీసులు అందిస్తామని దెందులూరు తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య అన్నారు. గురువారం తహసీల్దార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఆరోగ్యం, పౌష్టికాహారం పంపిణీ లక్ష్యంగా అంగన్‌వాడీ సిబ్బంది వెంటనే విధుల్లో చేరాలని కోరుతూ నోటీసులు జారీ చేశామన్నారు. ఇప్పటికే నెల రోజులుగా అంగన్‌వాడీ సిబ్బంది సమ్మె చేస్తున్న విషయం విదితమే. ప్రభుత్వం జారీ చేసిన నోటీసులు వీఆర్వోలు, వీఆర్ఏల ద్వారా అందజేశామని తహసీల్దార్ వివరించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

నిడమర్రు: బువ్వనపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని బువ్వనపల్లి, చానమిల్లి, సిద్ధాపురం, క్రొవ్విడిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏలూరు ఈఈ నటరాజన్ తెలిపారు. విద్యుత్ లైన్లు, సబ్ స్టేషన్ నిర్వహణ నిమిత్తం సరఫరా ఉండదని ఆయన తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి అందరూ సహకారం అందించాలి

- ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి
- ఉంగుటూరులో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం


ఉంగుటూరు మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి

ఉంగుటూరు: గ్రామాల అభివృద్ధికి పార్టీల రహితంగా అందరూ ముందుకు వచ్చి సహకారం అందించాలని ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి అన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ప్రజాప్రతినిధులు మండల సమావేశాల్లో చర్చించాలని ఆమె కోరారు. గురువారం ఉంగుటూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో సర్వ సభ్య సమావేశం ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి గ్రామానికి పారదర్శకంగా నిధులు కేటాయిస్తున్నామని అన్నారు. నిధులు కేటాయిస్తున్నా కొన్ని గ్రామాల నుంచి అభివృద్ధి పనులకు తీర్మానాలు అందించడం లేదని అన్నారు. సభ దృష్టికి వచ్చిన సమస్యలపై చర్చించి పరిష్కారం మార్గం సూచిస్తామని అన్నారు. ఎంఈవో శ్రీనివాసరావు మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 78 నుంచి 85 శాతానికి పెరిగిందని, 95 శాతం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగడానికి గ్రామాల్లో ప్రజాప్రతినిధులు కృషి చేయాలన్నారు. మండలంలో ఈ క్రాప్ బుకింగు 7,200 ఎకరాలు పూర్తయ్యిందని, ఫిబ్రవరి 15 లోపు మిగిలిన విస్తీర్ణం పూర్తి చేస్తామని ఏవో బాలిన వెంకటేష్ చెప్పారు. రెండో దశలో 379 ఇళ్ల పూర్తి చేసేందుకు అందరూ సహకరించాలని హౌసింగు ఏఈ చిలకా సురేష్ కోరారు. తహసీల్దార్ వెంకటరమణ మాట్లాడుతూ మండలంలో 30 ఇళ్ల నిర్మాణానికి స్థలాలు మంజూరయ్యాయని, 190 కొత్త రేషన్ కార్డులు వచ్చాయన్నారు. విద్యుత్ ఏఈ వేణు మాట్లాడుతూ ఆర్డీఎస్ స్కీములో విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తున్నామని వివరించారు. అధికారులు ఆయా శాఖల ప్రగతిని వివరించారు. ఈ సమావేశంలో వైఎస్ ఎంపీపీ సింగులూరు సూర్యనారాయణ, ఎంపీడీవో ప్రేమాన్విత, అంగన్‌వాడీ సూపర్ వైజర్ శారద, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో మల్లేశ్వరరావు, వెటర్నరీ స్టాకు లైవ్ అధికారి బాబూరావు, వెల్లమిల్లి సర్పంచ్ కుమార్ రాజు, నాచుగుంట సర్పంచ్ ఏలేటి సునీత, ఉప్పాకపాడు ఎంపీటీసీ మంగరాజు, ఎ గోకవరం విజయనిర్మల, నల్లమాడు ఎంపీటీసీ శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న తోడులో రూ.17.23 కోట్ల లబ్ధి

- జిల్లాలో 16,802 మందికి వడ్డీ లేని రుణాలు
- ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్



దెందులూరు: ఏలూరు జిల్లాలో జగనన్నతోడు పథకంలో రూ.17.23 కోట్లు బ్యాంకు ఖాతాలకు జమ చేయడం ఎంపీగా వ్యక్తిగతంగా తనకు ఎంతో సంతోషంగా ఉందని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వరుసగా 8వ విడతలో 16,802 మంది చిరువ్యాపారులకు ఒక్కొక్కరికీ రూ. 10 వేలు చొప్పున సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలో బటన్ నొక్కడంతో నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ కావడం చిరువ్యాపారులపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఉన్న ప్రేమ, ఆదరాభిమానాలకు నిదర్శనమన్నారు. అందరితో సమానంగా చిరువ్యాపారులకు సైతంగా ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందుతూ గౌరవంగా వారి కుటుంబాలు సంతోషంగా ఉండాలన్న దూరదృష్టి, ప్రణాళికతో సీఎం జగనన్న తోడు పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారన్నారు. చిరువ్యాపారులందరూ వచ్చిన నగదుతో వారి వ్యాపారాల్లో మరింత అభివృద్ధి సాధించి సంతోషంగా జీవించాలని శ్రీధర్ ఆకాంక్షించారు.

ఉపాధి హామీలో కొత్త నిబంధనలు అనుసరించాలి


భీమడోలులో సామాజిక తనిఖీ ప్రజావేదిక పాల్గొన్న డ్వామా పీడీ రాము, విజిలెన్స్ అధికారి ఏవీ విజయలక్ష్మి

భీమడోలు: సామాజిక తనిఖీల్లో వచ్చే కొత్త మార్పులను గుర్తించి అందుకు అనుగుణంగా ఉపాధి హామీ అధికారులు పనులు చేయించాలని జిల్లా డ్వామా పీడీ రాము అన్నారు. భీమడోలు ఎంపీపీ ప్రాంగణంలో మండల స్థాయిలో 16వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. రాష్ట్ర స్థాయి బృందం మానిటరింగ్ అధికారి గౌరీ శంకర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా డ్వామా పీడీ రాము, జిల్లా విజిలెన్స్ అధికారి ఏవీ విజయలక్ష్మీ హాజరయ్యారు. మండల వ్యాప్తంగా గతేడాది రూ.13.83 కోట్ల పనులు నిర్వహించగా సంబంధిత బృందాలు చేసిన తనిఖీల్లో వెల్లడైన అభ్యంతరాలు, ఇతర అంశాలపై ఉన్నతాధికారుల వద్ద నివేదించారు. సుమారు రూ.90వేల అభ్యంతరాలున్నట్లు గుర్తించారు. తొలుత గౌరీ శంకర్ మాట్లాడుతూ ఎస్ఏసీ సాఫ్ట్‌వేర్ అనుసరించి చేస్తున్న ప్రతి పనికి ఆధారాలు ఉండాలని, విధిగా ప్రతి నెలకు ఒక సారి ఫొటోలు తీసుకోవాలన్నారు. డ్వామా పీడీ రాము మాట్లాడుతూ మండలంలో సామాజిక తనిఖీల్లో కొలతల్లో తేడాలున్నట్లు గుర్తించామని, వాటి నివారణకు ఎం.బుక్‌లో ఎప్పటికప్పుడు కొలతలు నమోదు చేసుకోవాలన్నారు. ఎవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా మొక్కల పెంపకం దశల వారీగా ఇతర కార్యక్రమాలను నమోదు చేయాలన్నారు. ఉపాధి హామీ పథకంలో మండలానికి రూ.60లక్షలు కేటాయించామని వాటిలో గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి అనుమతులు రావాల్సి ఉందన్నారు. ఉపాధి హామీ పథకంలో ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించాల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లపై ఉందన్నారు. డీవీవో ఏవీ విజయలక్ష్మీ మాట్లాడుతూ ఉపాధి హామీ పనులపై 15 విడతలుగా నిర్వహించిన సామాజిక తనిఖీ వేదికల్లో సున్నా శాతం రికవరీతో భీమడోలు మండలం ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. 15 విడతలుగా మండలంలో రూ.60 కోట్ల పనులు పూర్తవగా 0.01శాతం ఆడిట్ అభ్యంతరాలు ఉన్నప్పటికీ సాంకేతిక లోపాల కారణంగా ఇవి నమోదైనట్టు గుర్తించామన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ కనమాల రామయ్య, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, జగన్‌సేవాదళ్ నియోజకవర్గ కన్వీనర్ తుమ్మగుంట రంగ, ఏపీడీ జి.సుధాకర్, ఎంపీడీవో సీహెచ్ పద్మావతి, ఏపీవో కె.పద్మ, సర్పంచులు దాయం సుజాత, గుడివాడ నాగగౌతమి, మానుకొండ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నీట మునిగిన రోడ్డు.. రైతుల ఇక్కట్లు


నీట మునిగిన గణపవరం వరదరాజపురం పుంత రోడ్డు

గణపవరం: గణపవరం వరదరాజపురం గ్రామాల మధ్య రైతులకు ఉపయోగపడే పుంత రోడ్డు నీట మునగడంతో ఆ ఆయకట్టులోని రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరదరాజపురం పంట కాలువకు అరకొరగా మరమ్మతులు చేసి అసంపూర్తిగా వదిలివేయడంతో ఈపరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. తమ పొలాలకు మోకాలి లోతు నీటిలో వెళ్లాల్సి వస్తోందని వారంటున్నారు. వరదరాజపురం బ్రాంచ్ కెనాల్ మరమ్మతులకు నిధులు మంజూరవడంతో ఇటీవల పనులు ప్రారంభించారు. కాలువను అభివృద్ధి పనులు వరదరాజపురం సరిహద్దు వరకే పూర్తిచేసి, మిగిలిన భాగం అసంపూర్తిగా వదిలేయడంతో నీటి ప్రవాహం పెరిగినప్పుడు నీరు పొంగి రోడ్డుపైకి వస్తోంది. దీనితో రోడ్డుపై మోకాలిలోతు నీరు నిలుస్తోంది. త్వరగా ఈ సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు. ఈ రోడ్డు అభివృద్ధికి మార్కెట్ కమిటీ నుంచి నిధులు మంజూరైనా ఇంకా నిర్మాణ పనులు చేపట్టలేదని రైతులు తెలిపారు. వెంటనే బ్రాంచి కాలువ పనులు పూర్తిచేసి, రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆప్రాంత రైతులు కోరుతున్నారు.

వైఎస్సార్ బీమా అందజేత


వైఎస్సార్ బీమా సొమ్మును లబ్ధిదారులకు అందజేస్తున్న నాయకులు

ఉంగుటూరు: వైఎస్సార్ బీమా సొమ్మును గురువారం మండలంలోని నారాయణపురం సచివాలయం-2 పరిధిలో నలుగురు లబ్ధిదారులకు వైఎస్సార్ సీపీ నాయకులు అందజేశారు. లబ్ధిదారులైన లక్ష్మి జ్యోతి, షేక్ నూర్జహాన్, వాల్మీకి వెంకటలక్ష్మి, పైడి పార్వతికి ఉంగుటూరు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ మరడ వెంకటమంగరావు చేతల మీదుగా బీమా సొమ్ము అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పైడి అరుణ్‌కుమార్, మరడ సాంబశివరావు, అరవెల్లి మహాలక్ష్మి, దానయ్య, సిపాని శివ బాలు, పెంట రామకృష్ణ, కిలపర్తి హనుమంతు, పైడి వరప్రసాద్, లావేటి వీరాచార్యులు, సచివాలయం సెక్రటరీ దుర్గాధర్, వెల్ఫేర్ అసిస్టెంట్ అనూష పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సత్రంపాడు లక్ష్మీ గణపతి ఆలయంలో దేవదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు గురువారం హుండీలను లెక్కించారు. స్వామికి హుండీల ద్వారా 100 రోజులకు రూ.57,785 ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వహణాధికారి సీహెచ్ చిన నాగేశ్వర రావు తెలిపారు. పత్తేబాద శ్రీ చౌడేశ్వరి రామలింగేశ్వర స్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి డీ. శంకరరావు పర్యవేక్షించారు.

మద్యం సీసాల స్వాధీనం

భీమడోలు: పూళ్ల శివారు ఎంఎంపురంలో అక్రమంగా మద్యం సీసాలను నిల్వ ఉంచి, అధిక ధరలకు విక్రయిస్తున్న మద్దాల ఏసుబాబును బుధవారం రాత్రి భీమడోలు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మద్దాల ఏసుబాబు మద్యం దుకాణం నుంచి నాలుగు క్వార్టర్ సీసాలను తెచ్చుకుని తన ఇంటి వద్ద అధిక ధరలకు విక్రయిస్తుండగా భీమడోలు హెచ్‌సీ డి.శ్రీనివాసరావు అదుపులోకి తీసుకుని వాటిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై వై.సుధాకర్ పేర్కొన్నారు.

లాల్‌బహదూర్ శాస్త్రి జీవితం ఆదర్శనీయం


భీమడోలులో లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మండే సుధాకర్, విద్యార్థులు

భీమడోలు: మాజీ దేశ ప్రధాని, భారతరత్న లాల్‌బహదూర్ శాస్త్రి దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ అన్నారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గురువారం సాయంత్రం లాల్‌బహదూర్‌శాస్త్రి 58వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శాస్త్రి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జై జవాన్, జై కిసాన్ నినాదాన్ని రూపొందించిన మహోన్నత వ్యక్తి లాల్‌బహదూర్ శాస్త్రి నిస్వార్థ దేశ భక్తుడని అన్నారు. నిరాడంబర జీవితం గడిపిన శాస్త్రి మార్గం నేటి తరానికి ఆదర్శం కావాలని కోరారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల చిన్నారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణాలు రక్షించండి

ఏలూరు(మెట్రో) : అనారోగ్యానికి గురైన వారికి శస్త్ర చికిత్సల్లో, రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులకు రక్తదానం చేయటం ద్వారా వారి ప్రాణాలు రక్షించినట్టేనని, సామాజిక బాధ్యతలో భాగంగా ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని ఏలూరు జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలు సామాజిక సమతా సంకల్పం కార్యక్రమాలు ఏర్పాటు చేసి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు ఘనంగా నివాళులర్పిస్తున్నారు. ఏలూరు సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని రెడ్‌క్రాస్ భవన్‌లో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో చేపట్టిన రక్తదాన శిబిరంలో పాల్గొన్న డీపీవో యువతను ఉద్దేశించి మాట్లాడుతూ యువత అన్ని రంగాల్లోనూ ముందుంటూ సామాజిక చైతన్యానికి నాంది పలకాలని కోరారు. రక్తదాన శిబిరాన్ని పరిశీలించి, 65 యూనిట్ల రక్తదానం చేసిన డ్వామా కార్యాలయ సిబ్బంది, ఆర్‌టీసీ సిబ్బంది, రామచంద్ర ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ రాము, జిల్లా వైద్యశాఖ అధికారి యం.నాగేశ్వరరావు, రెడ్‌క్రాస్ కార్యదర్శి సీతారాం, డాక్టర్ వరప్రసాద్ ఉన్నారు.

దాళ్వా సాగు పనులు ముమ్మరం

- నారుమళ్లు, నాట్లు పనుల్లో అన్నదాతలు నిమగ్నం
- 4,900 హెక్టార్లతో వరి సాగవుతుందని అంచనా


పొలంలో నాట్లు వేస్తున్న కూలీలు


వరి నాట్లు వేసేందుకు పొలం సిద్ధం

పెదవేగి : దాళ్వా వరి సాగు చేసే రైతులు నారుమళ్లు పోసే పనుల్లో నిమగ్నమయ్యారు. దెందులూరు నియోజకవర్గ వ్యాప్తంగా పెదవేగి పరిధిలో ఈ ఏడాది 350 హెక్టార్‌లో వరి సాగు అవుతోంది. దెందులూరు మండలంలో 3,400 హెక్టార్లు, పెదపాడు మండలంలో దాళ్వా సాగులో 720 హెక్టార్లలో నారుమళ్లు పూర్తయ్యాయి. ఏలూరు రూరల్ 430 హెక్టార్లు సాగవుతుండగా, మొత్తం 4,900 దాళ్వా సాగులో ఉండగా, ప్రస్తుతం 3,650 హెక్టార్లలో నారుమడులు పూర్తయ్యాయని అధికారులు చెబుతున్నారు. ఎకరం విస్తీర్ణం భూమికి అవసరమైన నారు కోసం 5 సెంట్ల విస్తీర్ణంలో నారుమళ్లు తయారు చేస్తున్నారు. పెదవేగి మండలంలోని ప్రధాన నీటి చెరువుల్లో కొంత మేర నీరు చేరడంతో రైతులు ఎంతో ఆశతో పూర్తిగా వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ ప్రాంతంలో ముఖ్యంగా 1156,1153, 1121 వరి విత్తనాలను వినియోగిస్తున్నారు. నారుమళ్ల కోసం దున్ని భూమిని దమ్ము చేసి, పాయలుగా విడదీసిన అనంతరం విత్తనాలను వెదజల్లుతున్నారు. విత్తనాలను వెదజల్లేందుకు ముందు నారుమడిని రెండు లేక మూడు పర్యాయాలు దమ్ము చేసిన అనంతరం రైతులు దమ్ము చేస్తున్నారు. మడిని పాయలుగా విడదీసి విత్తనాలు వెదజల్లుతున్నారు.

విత్తనశుద్ధి తప్పనిసరి

వరి నారుమళ్లు పోసే రైతులు తప్పని సరిగా విత్తనశుద్ధి చేసుకోవాలి. దీనివల్ల పంటకు అగ్గితెగులు సోకే అవకాశం ఉండదు. ఒక లీటరు నీటిలో 5 గ్రాముల ట్రైకోకడెర్మావిర్దీని లేదా సుడోమోనాస్‌ను కలిపి విత్తనశుద్ధి చేయాలని పెదవేగి మండల వ్యవసాయాధికారిణి ఎం ప్రియాంక తెలిపారు.

విత్తనాల మొలక శాతం పరీక్షించాలి

వరి విత్తనాలను చల్లే ముందుగా మొలక శాతం పరీక్షించాల్సి ఉంది. లేని పక్షంలో రైతులు నష్టపోయే అవకాశం ఉంది. ఎకరానికి అవసరమైన నారు కోసం 5 సెంట్ల భూమిలో 20 నుంచి 25 కేజీల విత్తనాలను చల్లుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

జింక్, ఐరన్ లోప నివారణ చర్యలు తీసుకోవాలి

వరి నారుమడి పోసిన తర్వాత 15 రోజుల్లో జింక్, ఐరన్ లోప నివారణకు చర్యలు తీసుకోవాలి. దీని కోసం రెండు శాతం జింక్ సల్ఫేట్, అన్నభేది నిమ్మ ఉప్పును పిచికారీ చేయాలి. నారుమడిలో నీరు పెట్టడానికి, తొలగించడానికి అనువుగా కాలువలు ఏర్పాటు చేయాలని అధికారులు సూచించారు.

25 రోజుల తర్వాతనే నాటాలి

నారు పోసిన 25 రోజుల తర్వాతనే నారు తీసి నాట్లు వేసుకోవాలి. కాండం తొలుచు పురుగు, ఆకు తొలుచు పురుగు నివారణ కోసం నాట్ల వేసేందుకు, నారు తీసేందుకు ముందుగా మడిలో ఎకరానికి కేజీ కార్బోఫ్యూరాన్ గుళికలను చల్లాలి.

– ఎం ప్రియాంక, వ్యవసాయాధికారిణి, పెదవేగి